క్లుప్తంగా

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తిరుపతన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమం, కులగుణనలో భాగంగా 4 విడతల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను అర్హులైన వారిని పరిశీలించి అమలు చేయాలని సూచించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

మానవపాడు: ఉపాధ్యాయులందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన బోధన పద్ధతులు, బోధనోపకరణాలు తయారీ గురించి అవగాహన కల్పించారు. నూతన బోధనా పద్ధతులు అలవర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా సులభంగా బోధించాలన్నారు.

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి



అయిజ: సుష్మస్వరాజ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సుష్మస్వరాజ్ ప్రధాన భూమిక పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, లక్ష్మణాచారి, భీమన్న, ఆంజనేయులు, వెంకటేష్, మధు, మల్లయ్య ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లా రికవరీ అధికారి హరీశ్ దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, చైర్మన్ బ్యాంకు అధికారులకు సాదర స్వాగతం పలికారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధికారులకు ఆలయ విశిష్టతను వివరించి శేషవస్త్రంతో సత్కరించి మెమోంటో అందజేశారు. పూజల్లో బ్యాంకు మేనేజర్ గంగాధరం, క్యాషియర్ శివ, సిబ్బంది ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

శాంతినగర్: యాపదిన్నె గ్రామానికి చెందిన రమేష్ హత్య వెనక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శాంతినగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. హత్యకు కారణం అన్నదమ్ముల ఆస్తి తగాదాలే కారణమని అంటునప్పటికీ.. దాని వెనుక వడ్డేపల్లి, అయిజ మండలాల్లోని నాయకుల పాత్ర ఉందని ఆరోపించారు. వారి ప్రమేయంతోనే హత్య జరిగినట్లుగా అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. పథకం ప్రకారమే రమేష్ హత్య జరిగినట్లు ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న, జిల్లా కన్వీనర్ రాజు, మండల అధ్యక్షుడు ఏసేపు మాదిగ, రవి, బీసన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

త్రిఫ్ట్ ఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్‌ఫండ్ పథకానికి సంబంధించి అర్హులైన కార్మికులు తమ వ్యక్తిగత దరఖాస్తు పత్రాలను శనివారం జౌళీశాఖ కార్యాలయంలో అందించాలని చేనేత జౌళీశాఖ ఏడీ గోవిందయ్య కోరారు. జిల్లాలోని అమరచింత, కొత్తకోట, తిప్పుడంపల్లి, వెల్టూరు, ఖిల్లాఘనపురంతో పాటు ఆయా గ్రామాల్లో చేనేతపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు మగ్గానికి ఇద్దరు చొప్పున జియో ట్యాగింగ్ నంబర్ ఆధారంగా దరకాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆర్డీ 1 బ్యాంక్ ఖాతాలో తమ నెలసరి వేతనంలో 8 శాతం జమచేయాలని, అలాంటి వారు శనివారం పూర్తి వివరాలతో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్‌టీ లోన్లు చెల్లించాలి

ధన్వాడ: వ్యాపారస్తులు ఎల్‌టీ లోన్లను తిరిగి చెల్లించాలని సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జమా ఖర్చుల వివరాలు కమిటీ సభ్యులకు వివరించారు.

తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన తిక్క వీరేశ్వరస్వామి ఆలయం



స్వామివారి ఊరేగింపునకు సిద్ధం చేసిన రథం

- నేటి నుంచి ఈ నెల 26 వరకు వేడుకలు
- ఉత్సవ విగ్రహ ఊరేగింపుతో ప్రారంభం
- మహా శివరాత్రి రోజు ముగింపు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 26 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా శనివారం ఆలయ అర్చకుడి నివాసం నుంచి స్వామివారి ఆలయం వరకు తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు భక్తుల కోలాటాల నడుమ వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి ప్రభోతవ్సం చేస్తారు. అదేవిధంగా 16న ఆలయంలో వేదపండితులచే శాంతిహోమం, 17న అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం, 18న ప్రత్యేక పూజలు, 19న దొబ్బుడు గుండ్లు, సంద రాళ్లు ఎత్తు పోటీలు, రాత్రికి అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహిస్తారు. 20న జాతీయ స్థాయి కుస్తీ పోటీలు, 21న అంతర్రాష్ట్ర స్థాయి పోటీల్ల బల ప్రదర్శన, 22న పాలపళ్ల విభాగం వృషభాల బల ప్రదర్శన, 23న సేద్యపుటెద్దుల విభాగం బల ప్రదర్శన, 24న సీనియర్స్ విభాగం వృషభాల బల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. 25న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

అర్హులందరికీ ‘ఉపాధి’ పనులు



ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

గట్టు: గ్రామాల్లో పనులు చేస్తామంటూ ముందుకు వచ్చే వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ చెన్నయ్య అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నయ్య మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. నర్సరీలపై దృష్టి పెట్టి మొక్కల పెంపకాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. వర్షాకాలం నాటికి మొక్కలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బంది నిరసన

గద్వాల క్రైం: జిల్లా ఆస్పత్రిలోని బ్లండ్ బ్యాంక్, ఐసీయూలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు అందడం లేదని శుక్రవారం సిబ్బంది ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో 33 మంది రోగులకు అత్యవసర సేవలు అందిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన జీతాలు ఇవ్వడంలో జాప్యం కనబరుస్తుండడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించాల్సిన జీతాలను వెంటనే అందించాలన్నారు. లేని తరుణంలో తమ నిరసనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



పుల్వామా అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన కొత్తకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగే పోటీల్లో 10 ప్రాంచైజీలతో 10 టీమ్‌లు, 24 మ్యాచ్‌లు ఉంటాయి. ఇందులో మొదటి విజేతకు రూ.ఒక లక్ష, రన్నప్‌గా నిలిచిన జట్టుకు రూ.50 వేలు మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి వారి మనువడు హరిన్‌రెడ్డి అందజేస్తారని ప్రకటించారు. ప్రారంభ వేడుకల్లో మొదటగా పుల్వామా దాడిలో మరణించిన జవాన్లకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీ జవాన్ల గొప్పతనాన్ని, దేశ రక్షణలో వారి సేవలను కొనియాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ రాంబాబు, హరిన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, ఎల్లంపల్లి నరేందర్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, గుంత శివ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



అయిజ: మండలంలోని పులికల్‌లో గుంటిరంగనాథ స్వామి జాతరను పురస్కరించుకొని శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ గ్రామాల నుంచి వివిధ జట్లు పాల్గొనగా.. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. క్రీడలను చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో శివ మహాపడి పూజ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండల కేంద్రంలో శుక్రవారం శివ మాలధారులు మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన శివ మాలధారులు తెల్లవారుజామున సమీపంలోని పవిత్ర కృష్ణానది జలాలను జల్దిబిందెలతో తీసుకొచ్చి శ్రీకృష్ణనగర్‌లోని శివాలయంలో స్వామివారిని అభిషేకించారు. పట్టణ పురవీధుల గుండా శివ పల్లకీ, కలశ ఊరేగింపు చేసి ఆలయంలో మహాపడిపూజ నిర్వహించారు. దీంతో శివ నామస్మరణతో ఆలయ ప్రాగణం పులకించింది. గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారి జంగం శివానంద్ పూజలు చేశారు. పూజకు హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని పట్టణానికి చెందిన జరిచీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు వితరణ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: గుట్టుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు శుక్రవారం సాయంత్రం స్థావరంపై దాడి చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.10,490 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలంలోని పరుమాల గ్రామ శివారులో 10 మంది కలిసి పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు స్థావరంపై దాడులు చేశామని ఎస్‌ఐ అన్నారు. ఈ దాడుల్లో అయిదుగురు తప్పించుకున్నారన్నారు. వీరిపై గేమింగ్ యాక్టు కింద కేసులు నమోదు చేశామన్నారు.

‘అక్రమ రిజిస్ట్రేషన్ నిలిపివేయాలి’



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

ధరూరు: తమకు అమ్మిన భూమిని ఇతరులకు అక్రమ రిజిస్ట్రేషన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నీలహళ్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె ఎల్లప్ప, ధర్మన్నకు చెందిన సర్వే నంబరు 338/1/1/1 లో గల నాలుగు ఎకరాల 12 గుంటల భూమిని గతంలో అదే గ్రామానికి చెందిన మిట్టదొడ్డి తిమ్మప్ప, గరిమిరెడ్డి, నడ్డి రంగప్ప, బాపని నర్సింహులు, ఓబులప్ప, చిన్న మునెప్ప, సొంటి రంగప్ప పశువుల మేత కోసం దొడ్ల ఏర్పాటుకు సాదా బైనామా ప్రకారం కొనుగోలు చేశారు. అయితే తమకు రావాల్సిన భూమిని ఇతరులకు అక్రమంగా అమ్మి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న బాధితులు శుక్రవారం తహసీల్దార్ విజయ్ భూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని రైతులు వినతిపత్రంలో కోరారు.

మల్దకల్ మండలంలో జోరుగా మట్టి తవ్వకాలు



ఎల్కూరులో మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చర్లగార్లపాడు, కుర్తిరావల్‌చెర్వు, తాటికుంట, మంగంపేట, మల్దకల్ శివారులోని ప్రభుత్వ భూమిలో ప్రతి రోజు మట్టిని జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇళ్ల నిర్మాణం, వెంచర్లకు భారీ మొత్తంలో మట్టి తరలిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులు ప్రతి నిత్యం మట్టిని తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్య ప్రజలు ఒక ట్రాక్టర్ మట్టి కోసం నానా అవస్థలు పడుతుంటే.. అధికారుల అండదండలతో నాయకులు వందలాది ట్రాక్టర్ల మట్టిని తరలించినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గురువారం రాత్రి ఎల్కూరు గ్రామ సమీపం నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఎల్కూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకోగా.. టిప్పర్లను వదిలేయాలంటూ నాయకులు, పోలీసుల నుంచి పెద్ద ఎత్తున ఆ వ్యక్తిపై ఒత్తిడి చేశారని ఆరోపించారు. మైనింగు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఎల్కూరు గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మట్టి అక్రమ తవ్వకాలపై కఠినచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

‘పుల్వామా’ అమరవీరులకు ఘన నివాళి



ఉండవెల్లి మైనార్టీ గురుకులలో విన్యాసం చేస్తున్న విద్యార్థులు



అయిజలో..

అయిజ: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లను శుక్రవారం మండల కేంద్రంలోని న్యూ గీతాంజలి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు. వీర జవాన్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేష్ మాట్లాడుతూ.. 2019 ఫిబ్రవరి 14న సైనికుల కాన్వాయ్‌పై దుండగులు ఆత్మాహుతి బాంబుతో దాడి చేయడంతో 40 మంది సీఆర్‌పీఎఫ్ సైనికులు వీరమరణం పొందారన్నారు.

⇨ అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు శుక్రవారం పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లకు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ఎదుట అమర జవాన్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర కార్యకవర్గ సభ్యుడు లోకేష్, బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల్లో విద్యార్థుల విన్యాసం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పుల్వామా దాడి జరిగిన ఘటనపై సంఘీభావంగా జవాన్లకు నివాలర్పించారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో విద్యార్థులు జవాన్ల ఆర్ట్‌లను గీశారు. అనంతరం విన్యాసాలతో అలంరించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు బీజేపీ నాయకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

వార్షిక పరీక్షల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థుల మార్కులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్ర బాబు

ధరూరు: మండలంలోని మార్లబీడు శివారులోని నెట్టెంపాడు క్వార్టర్స్‌లో కొనసాగుతున్న ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రవీంద్ర బాబు సందర్శించారు. శుక్రవారం ఆయన పాఠశాలకు చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులపై ఆరా తీశారు. వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్ మార్కులతో వంద శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అంతకు ముందు మండలంలోని ర్యాలంపాడు యూపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆపార్ ఐడీలను క్రియేట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రిజిస్టర్లు, స్టోర్ రూంలో వంట సరుకులను పరిశీలించారు.

విశ్వసనీయత ఏది..?

పెబ్బేరు గోదాంలో అగ్నిప్రమాదం జరిగి పది నెలలు



పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్)

- రూ.20 కోట్ల ప్రజాధనం వృథాపై నేటికీ నిగ్గుతేలని నిజాలు
- ఎండ తీవ్రతకు మంటలు చెలరేగాయని ప్రచారం
- రాజకీయ జోక్యంతో విచారణ మలుపు తిరుగుతోందా?

వనపర్తి: పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో గన్నీబ్యాగులు నిల్వచేసిన ఓ గోదాంలో మంటలు చెలరేగి సుమారు రూ.20 కోట్ల నష్టం వాటిల్లిన సంగతి పాఠకులకు విధితమే. ఈ ఘటన జరిగి సుమారు 10 నెలలు గడుస్తున్నా.. కారకులు ఎవరనే విషయాన్ని నేటికీ పోలీసులు గుర్తించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.కోట్ల ప్రజాధనం వృథా అయిన ఘటనపై విచారణ మందకొడిగా సాగడమేమిటనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కారణాలు ఏవైనా.. ఈ విషయంపై మాట్లాడేందుకు అటు పోలీసు అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు అనాసక్తి చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిందితులను కాపాడేందుకు అధికారులు కొత్త దారులు వెదుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడురోజుల పాటు మంటలు..

కొందరు స్థానిక నాయకులు గోదాంలో భద్రపర్చిన గన్ని బ్యాగుల్లో సుమారు 7 లక్షలు ఇతర జిల్లాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారన్న విషయాన్ని వెలుగులోకి రాకుండా రూ.10 కోట్ల విలువైన సుమారు 12.94 లక్షల గన్ని బ్యాగులకు నిప్పు పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మూడురోజుల పాటు మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపకశాఖ అధికారులు గోదాం గోడలను పగలగొట్టి నలువైపుల నుంచి మంటలు ఆర్పే ప్రయత్నం చేయడంతో.. రూ.10 కోట్ల విలువజేసే గోదాం సైతం దెబ్బతింది. దీంతో ఆస్తి నష్టం విలువ సుమారు రూ.20 కోట్లకు చేరిందని ప్రాథమిక అంచనా. ఈ ఘటనపై ఇటీవల పోలీస్ అధికారులు ఇచ్చిన దర్యాప్తు నివేదికను కలెక్టరేట్ అధికారులు వెల్లడించడానికి విముఖత చూపుతున్నారు. ఇందుకు కారణాలు ఏమిటనే విషయం వారే వెల్లడించాల్సి ఉంది.

సీఎం, డీజీపీ దృష్టికి తీసుకెళ్తాం..

ఈ విషయంపై ఇటీవల స్పందించిన బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు.. ఈ ఘటనపై చాలా అనుమానాలు ఉన్నాయని, ప్రజాధనం వృథా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

రాజకీయ జోక్యమేనా..?

గన్ని బ్యాగుల దగ్ధం కేసులో కొందరు స్థానిక నేతల హస్తం ఉందనే కోణంలో మొదట్లో పోలీసుల విచారణ సాగింది. అంతలోనే చోటు చేసుకున్న కొన్ని రాజకీయ పార్టీ ఫిరాయింపులతో విచారణ మలుపు తిరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ తుది దశకు చేరుకునే సమయంలోనే.. ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు పార్టీ మారినట్లు వదంతులు వినిపిస్తున్నాయి. వారంతా అధికార పార్టీలో చేరడంతో విచారణ మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన విచారణ నివేదికలో ఎండ తీవ్రతకు గోదాంలో మంటలు చెలరేగి గన్నీ బ్యాగులకు నిప్పంటుకున్నట్లు పేర్కొన్నట్లు ప్రచారం సాగుతోంది.


విచారణ కొనసాగుతోంది..



పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో మంటలు చెలరేగి గన్ని బ్యాగులు కాలిపోయిన కేసు విచారణ కొనసాగుతోంది. కొత్తకోట సీఐ రాంబాబును విచారణ అధికారిగా నియమించాం. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిన నమూనాల ఆధారంగా వచ్చిన నివేదిక ఆధారంగా విచారణ కొనసాగుతోంది. పూర్తి కాగానే వివరాలు వెల్లడిస్తాం.

– వెంకటేశ్వరరావు, డీఎస్పీ, వనపర్తి

నివేదిక చూడలేదు..



గన్నీ బ్యాగుల దగ్ధం కేసులో విచారణ నివేదికను ఇటీవలే పోలీసు అధికారులు అందజేశారు. నివేదికను ఇప్పటి వరకు చదవలేదు. ఈ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం.


– జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అయిజ: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో డ్రంకెయిన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపరాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలు చేశారు. కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.